క్లుప్తంగా

అంకమ్మ అమ్మవారికి పూజలు



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్లలో భాగంగా నాలుగోరోజు సోమవారం గ్రామస్తుల బోనాలతోపాటు అంకమ్మ క్రతువులను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం బయనీడువారు పూలకప్పెర పట్టుకొని గ్రామంలో అమ్మవారి చరిత్రను ఒగ్గుకథ రూపంలో చెప్పారు. అలాగే అర్ధరాత్రి తరువాత అంకమ్మవారి ఆలయంలో దీవెనబండారు కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఆలయ అధికారులు తెలిపారు. అంకమ్మ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన జలబిందెల్లోని నీటిని నవధాన్యాలపై చల్లుతున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జరిగే పూర్ణాహుతి కార్యక్రమంతో పెద్దతిరునాళ్ల మహోత్సవాలు ముగుస్తాయని ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో కె.రమేష్నాయుడు తెలిపారు.

ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు ప్రారంభం



లింగగూడెం(పెనుగంచిప్రోలు):మండలంలోని లింగగూడెంలో శ్రీహనుమాన్ సీతా లక్ష్మణ సహిత శ్రీకోదండరామస్వామి ఆలయ ప్రతిష్ఠ, జీవ ధ్వజ, విమాన శిఖర, గణేష్, నాగరాజ ప్రతిష్టా మహోత్సవ పూజలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. పరాంకుశం అచ్యుతాచార్యులు, తిరుమల తిరుపతి ఆలయ వేద విశ్వ విద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్ రొంపిచర్ల వెంకట సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు పూజలు, హోమాలు నిర్వహించనున్నారు. అనంతరం ఈనెల 28న ప్రతిష్టా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మార్చి 3న పల్స్‌పోలియో

గంద్రాయి(జగ్గయ్యపేట): మార్చి మూడోతేదీన నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బూచవరం వైద్యాధికారి అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ఐదేళ్లలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేస్తామని వివరించారు. మండలంలో ఐదేళ్లలోపు చిన్నారులు 6900మంది ఉన్నట్లు గుర్తించామని, వీరికి పోలియోచుక్కలు వేసేందుకు 44 పోలింగ్‌కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో కేంద్రంలో నలుగురు వైద్యసిబ్బంది అందుబాటులో ఉండి, చిన్నారులకు పోలియోచుక్కలు వేస్తారన్నారు. పోలియో చుక్కలు వేసేందుకు ఓ మొబైల్ వాహనాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నాలుగు, ఐదు తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేసేలా చర్యలు చేపట్టామని వివరించారు. చిన్నారుల తల్లిదండ్రులు మార్చి మూడో తేదీన చిన్నారులకు తప్పకుండా పోలియోచుక్కలు వేయించాలని వైద్యాధికారి అనిల్‌కుమార్ కోరారు.

బీఎల్వోలతో ఆర్డీవో సమీక్ష

జుజ్జూరు(వీరులపాడు): పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన అన్నివసతులను బీఎల్వోలు కల్పించాలని ఆర్డీవో సాయిబాబు సూచించారు. మండలంలోని జుజ్జూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ఆయన బీఎల్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజకిషోర్, డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శివప్రసాద్, బీఎల్వోలు పాల్గొన్నారు.

స్వశక్తిపై ఆధారపడితేనే మంచిపేరు



ఆటోనగర్(విజయవాడతూర్పు): మహిళలు స్వశక్తి మీద ఆధారపడి జీవించినప్పుడే సమాజంలో మంచిపేరు ఉంటుందని కోవే ఏపీ చాప్టర్ రాష్ట్ర అధ్యక్షులు రాధిక అన్నారు. మూడు రోజుల నుంచి సుమారు 150 మంది మహిళలకు కేకుల తయారీపై శిక్షణ సోమవారం ముగిసింది. ఈసందర్భంగా పిజ్జా, చిరుధాన్యాలతో బిస్కెట్ తయారీ విధానంపై నిపుణులు, మహిళలకు శిక్షణనిచ్చారు. రాధిక మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న తర్వాత మీ ఇంటి వద్ద నిత్యం కేక్‌లను తయారు చేస్తే ఆర్థిక ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. కొందరు మహిళలు గతంలో శిక్షణ పొందినవారు సొంతంగా తయారు చేసి ఆర్డర్‌లను వేరే షాపులకు, ఫంక్షన్లకు అందజేసి ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారన్నారు. మరి కొందరైతే బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకొని ఇంటివద్దనే బిస్కెట్లు, కేక్‌లు తయారు చేస్తూ కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉంటున్నారని వివరించారు. కోవే కార్యదర్శి విజయలక్ష్మి, మోహిణి, మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధిపథంలో జంట గ్రామాలు

- బోడవాడ, జమ్మవరం గ్రామాల్లో గణనీయ అభివృద్ధి..
- కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు
- పెరిగిన మౌలికవసతులు
- హర్షం వ్యక్తంచేస్తున్న గ్రామస్తులు



బోడవాడలోని గ్రామ సచివాలయ భవనం

వీరులపాడు: మండలంలోని జంట గ్రామాలుగా పేర్కొందిన బోడవాడ, జమ్మవరం గ్రామాలు అభివృద్ధిపథంలో పయనిస్తున్నారు. రోడ్డుకు ఓవైపు బోడవాడ, మరోవైపు జమ్మవరం ఉంటాయి. దీంతో జంట గ్రామాలుగా పిలువబడే ఈ రెండు గ్రామాలు గత టీడీపీ పాలకుల నిరాదరణకు గురై కనీసవసతులు లేక ప్రజలు అవస్థలు పడగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఈ నాలుగేళ్ల తొమ్మిది నెలల పాలనలో గణనీయమైన అభివృద్ధిని సాధించింది. నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కృషితో ఈ గ్రామాల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరయ్యాయి. ఆయా నిధులతో ఇరుగ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టడంతో మౌలికవసతులు మెరుగుపడటంతో ఈ గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.1.11కోట్లతో అభివృద్ధి పనులు..

సీఎం జగనన్న పాలనలో కోట్లాది రూపాయలతో అభివృద్ధిపనులు చేపట్టడంతో ఈ గ్రామాల రూపురేఖలే మారిపోయాయి. ముఖ్యంగా బోడవాడలో రూ.40లక్షలతో గ్రామసచివాలయాన్ని నిర్మించగా, జమ్మవరంలో రూ.25 లక్షలతో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనం నిర్మించారు. రెండు గ్రామాల్లోని కాలనీల్లో రూ.25లక్షలతో సిమెంటురోడ్ల నిర్మాణం చేపట్టారు. రూ.17.50 లక్షలతో జమ్మవరంలో చేపట్టిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ పనులు, రూ.3.50లక్షలతో ఏర్పాటు చేస్తున్న మంచినీటి పైప్‌లైన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి.

రూ.1.10కోట్లతో పాఠశాలల అభివృద్ధి..

నాడు–నేడు పథకం కింద జమ్మవరంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాలలకు రెండు విడతల్లో కలిపి ప్రభుత్వం రూ.1.10కోట్లు కేటాయించింది. ఈ నిధులతో పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, మరుగుదొడ్లు, మంచినీటి వసతి కల్పించారు. విద్యార్థుల కోసం కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో కుర్చీలు, బల్లలు, డిజిటల్ తరగతుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.



జమ్మవరంలో నిర్మించిన రైతుభరోసా కేంద్రం



జమ్మవరంలోని ప్రాథమిక పాఠశాల

డీబీటీ ద్వారా 26.09కోట్లు..

జమ్మవరం, బోడవాడ గ్రామాల్లో కలిపి సుమారు 5500 జనాభా ఉన్నారు. సీఎం జగనన్న పాలనలో ఆయా పథకాల ద్వారా గ్రామస్తులకు డీబీటీ రూపంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.26.09కోట్లను నేరుగా వారి ఖాతాల్లోనే జమచేసింది. నాన్ డీబీటీ రూపంలోనూ జమ్మవరం, బోడవాడ గ్రామస్తుల కోసం కోట్లాది రూపాయలను ఖర్చుచేసింది.

173మందికి ఇళ్లస్థలాలు..

ముఖ్యంగా నిరుపేదల ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు బోడవాడ గ్రామంలో రూ.22 లక్షలకు రైతుల నుంచి భూమిని కొనుగోలు చేసి 74మందికి, జమ్మవరం రూ. 28 లక్షలతో 99 మందికి ఇళ్లస్థలాలను మంజూరు చేసింది. జగనన్న లేఅవుట్లలో రాష్ట్రప్రభుత్వం మొత్తం 173మందికి ఇళ్లస్థలాలతోపాటు ఇళ్లు మంజూరు చేసింది. ఇలా జంట గ్రామలైన జమ్మవరం, బోడవాడల అభివృద్ధికి నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఎంతో కృషి ఈ గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపరిచారు. దీంతో సీఎం జగనన్న ప్రభుత్వ హయాంలో ఈ జంట గ్రామాలు గణనీయ అభివృద్ధిని సాధించాయని ఇరుగ్రామాల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.



బోడవాడలో నిర్మించిన సిమెంట్‌రోడ్డు

గ్రామాలను అభివృద్ధి చేశారు



రెండు దశాబ్దాలుగా జమ్మవరం గ్రామం కనీస అభివృద్ధికి నోచుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి.

– యాదాల సుజాత, ఎంపీటీసీ, జమ్మవరం

సీఎంకు రుణపడి ఉంటాం..



బోడవాడ, జమ్మవరం గ్రామాల్లోని నిరుపేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. రెండు గ్రామాల పరిధిలో 4.30ఎకరాల భూమిని కొనుగోలు చేసి రెండు జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. గ్రామాలను అభివృద్ధి చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– శీలం సంధ్య, సర్పంచి బోడవాడ

సిలువగిరి తిరునాళ్ల ఏర్పాట్ల పరిశీలన



నందిగామ: ప్రశాంత వాతావరణంలో సిలువగిరి తిరునాళ్ల మహోత్సవాలు జరుపుకునేలా నిర్వాహకులు జాగ్రత్త చర్యలు పాటించాలని ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ సూచించారు. పట్టణ శివారులోని సిలువగిరి పుణ్యక్షేత్ర తిరునాళ్ల మహోత్సవాలు మంగళవారం నుంచి మూడురోజులపాటు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో తిరునాళ్ల ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. సిలువగిరి విచారణ గురువు ఎం. ఫిలోమెన్‌రాజు, సంఘ పెద్దలతో సమీక్ష నిర్వహించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఏసీపీ రవికిరణ్ మాట్లాడుతూ తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఇన్‌స్పెక్టర్ హనీష్ ఉన్నారు.

శివరాత్రి ఏర్పాట్లపై సమావేశం నేడు

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న భవానీ ముక్తేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు మార్చి ఐదో తేదీ నుంచి ప్రారంభం కానుండటంతో నందిగామ ఆర్డీవో పి.సాయిబాబు అధ్యక్షతన మంగళవారం అన్ని ప్రభుత్వశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో జయప్రకాష్‌బాబు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 10గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో కళ్యాణోత్సవాలు, మహాశివరాత్రి ఏర్పాట్లపై చర్చించనున్నట్లు వివరించారు. అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

పల్లెల స్వయం సమృద్ధితోనే దేశాభివృద్ధి

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామటౌన్): పల్లెలు స్వయం సమృద్ధి సాధిస్తేనే దేశం నిజమైన అభివృద్ధి సాధించినట్లనే సూత్రీకరణకు అనుగుణంగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలంలో ఏటూరులో సోమవారం ఆయన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. వారి యోగక్షేమాలతోపాటు వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలుతీరును ఆరా తీశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాలను అన్నిరకాలుగా అభివృద్ధి చేయడంతోపాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నారన్నారు. ముఖ్యంగా దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. కరోనా కష్టకాలంలో సైతం ఏమాత్రం వెనుకడుగు వేయకుండా సంక్షేమ పథకాలను ప్రజలకు అందించి వారికి అండగా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తుచేశారు. గతంలో ఎన్నికల సమయంలో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించే నేతలనే ప్రజలు చూశారని, కానీ నేడు ఇచ్చినమాట నిలబెట్టుకునే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూస్తున్నారని కొనియాడారు. ప్రతిపక్షాల మోసపూరిత హామీలను నమ్మవద్దన్నారు. ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి, అఖండ విజయాన్ని మరోసారి అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కందుల నాగేశ్వరరావు, వైఎస్ఎన్ ప్రసాద్, ముఖర్జీ, ధనమూర్తి, రాము, వేణు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



ఏటూరు గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

29న ఆలయ శంకుస్థాపన



శంకుస్థాపన చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ, నాయకులు

నరసింహారావుపాలెం(వీరులపాడు):మండలంలోని నరసింహారావుపాలెం సమీపంలోని అగస్త్యపీఠం ఆధ్వర్యంలో నిర్వహించనున్న లలితాదేవి పంచాయతన ఆలయ శంకుస్థాపనకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈనెల 29న జరగనున్న ఆలయ శంకుస్థాపన ప్రాంతాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశముండటంతో ట్రాఫిక్, తదితర ఇబ్బందులు లేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ మహాలక్ష్మణుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, ఉప సర్పంచి పసుపులేటి సాయిబాబు, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, పచ్చాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి



దబ్బాకుపల్లి(వత్సవాయి) : పాముకాటుతో వృద్ధురాలు మృతిచెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మల్లెబోయిన పిచ్చమ్మ(75) తెల్లవారుజామున నిద్రలేచే క్రమంలో కాలు కిందపెట్టగా, ఏదో కుట్టినట్లు గమనించి వెంటనే విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేసింది. కుటుంబసభ్యులు ఆమెను వెంటనే వత్సవాయిలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం జగ్గయ్యపేటకు తరలించారు. పేటలో వైద్యులు పిచ్చమ్మ పాముకాటుకు గురైనట్లు గుర్తించి, వైద్య సేవలు అందిస్తుండగానే ఆమె మృతిచెందింది. కుటుంబసభ్యులు ఇంటి వద్ద పరిశీలించగా, రేకులషెడ్డులో పాము ఉండటంతో వెంటనే దానిని చంపివేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

సొంతగూటికి చేరిన అనుమంచిపల్లి మాజీసర్పంచి



పాతకోటి కల్యాణ్‌బాబుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాసగౌడ్, గూడపాటి తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: అనుమంచిపల్లి మాజీ సర్పంచి పాతకోటి కల్యాణ్‌బాబు అలియాస్ ఉదయభాను టీడీపీని వీడి సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలోకి చేరారు. పేటలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మండల పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మండవ శ్రీనివాసగౌడ్, కల్యాణ్‌బాబుకు పార్టీ కండువా కప్పి సాదరంగా వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. అనంతరం శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రతిపక్ష పార్టీలు తమపార్టీలోని వారిని టీడీపీలోకి చేర్చుకునేందుకు అనేక విధాలుగా ప్రయత్నాలు చేస్తూ ఉంటారని, వారి మాటలు నమ్మి మోసపోకుండా నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాజీసర్పంచి పాతకోటి కల్యాణ్‌బాబు మాట్లాడుతూ అనివార్య కారణాలతో వైఎస్సార్ సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరానని, జరిగిన పొరపాటును గ్రహించి తిరిగి సొంతగూటికి వచ్చానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే ఉదయభాను గెలుపు కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి నాయుడు, ఏఎంసీ చైర్మన్ గూడపాటి శేషగిరిరావు, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు బజారు సాయి, మాజీ ఎంపీపీ మాతంగి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దాసాంజనేయస్వామి శిఖర ప్రతిష్ట



స్వామివారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



స్వామివారి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

పెద్దాపురం(వీరులపాడు): మండలంలోని పెద్దాపురంలో వేంచేసియున్న దాసాంజనేయస్వామి వారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం, రాజగోపుర శిఖర ప్రతిష్టా మహోత్సవాన్ని సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యే పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శిఖర ప్రతిష్టా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు..

రాజగోపుర శిఖర ప్రతిష్టా మహోత్సవానికి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు హాజరై, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ అర్చకులు, నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ శిఖర ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, , వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచి నిప్పులపల్లి శాంతమ్మ, గుడివాడ సాంబశివరావు, మాజీ సర్పంచి ఆవుల మాధవి, ఉప సర్పంచి బవిరిశెట్టి లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్పందనలో 11 అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో సాయిబాబు

నందిగామ: ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో పి.సాయిబాబు సూచించారు. తన కార్యాలయంలో సోమవారం ఆయన స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజల నుంచి మొత్తం 11 అర్జీలు అందినట్లు తెలిపారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించి ఎనిమిది, పోలీసుశాఖకు సంబంధించి రెండు, పంచాయతీరాజ్‌శాఖకు సంబంధించి ఒక్క అర్జీ అందినట్లు వివరించారు. ఆయా అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఆర్డీవో తెలిపారు.

రైతులను కేంద్రం ఆదుకోవాలని డిమాండ్

వత్సవాయి : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన వినాశకరమైన చట్టాలను రద్దుచేయాలని కోరుతూ ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతుల విషయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు దుర్మార్గమని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మండేపుడి చంద్రశేఖర్, కౌలు రైతు సంఘ జిల్లా నాయకులు సీహెచ్ హనుమంతురావు విమర్శించారు. ఢిల్లీలో రైతులపై కాల్పులు జరపడాన్ని నిరసిస్తూ వత్సవాయిలోని గాంధీపార్కు సెంటర్‌లో సోమవారం రైతుసంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు చట్టాలను రద్దు చేసి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులపై బీజేపీ ప్రభుత్వం బుల్లెట్లు, బాష్పావాయువు, డ్రోన్లతో దాడి చేయడం తగదన్నారు. పోలీసుల కాల్పుల్లో మృతిచెందిన శుభకరన్‌సింగ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల రైతుసంఘ కార్యదర్శి తమ్మినేని రాంబాబు, కౌలురైతు సంఘ అధ్యక్షులు కె.కోటయ్య, కార్యదర్శి టి.రమేష్, సీఐటీయూ మండల కార్యదర్శి బి.రాము తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ పనుల పరిశీలన



డివైడర్ పనులపై ఏఈతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

నందిగామ టౌన్: డివైడర్ ఏర్పాటు పనులను ఆర్ అండ్‌బీ అధికారులు త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ ఆదేశించారు. పట్టణంలోని చందర్లపాడు, రామన్నపేట రోడ్లలో జరుగుతున్న డివైడర్ ఏర్పాటు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతోపాటు పనులను వేగవంతం చేయాలని ఆర్అండ్‌బీ ఏఈ నరేంద్రకి సూచించారు. ముఖ్యంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేవించారు. ఎమ్మెల్సీ వెంట నాయకులు పారుపల్లి హరిబాబు, బొల్లినేని శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

బాలల హక్కులపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న గండేపల్లి సచివాలయ సిబ్బంది. అంగనవాడీ కార్యకర్తలు

కంచికచర్ల : బాలబాలికల సంరక్షణ చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని డాన్‌బోస్కో నవజీవన్ బాలభవన్ జిల్లా కోఆర్డినేటర్ మేరుగ రత్నం సూచించారు. మండలంలోని గండేపల్లి సచివాలయ సిబ్బంది, అంగనవాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లకు బాలల సంరక్షణ చట్టాలపై సోమవారం ఆయన అవగాహన కల్పించారు. రాజ్యాంగం కల్పించిన ఆయా హక్కులను వివరించారు. సచివాలయ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత మత్తుపదార్థాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్య ప్రాముఖ్యతను గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి బి.రవికుమార్, ఉపసర్పంచి బి.సుబ్బారావు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఎంసీ వైస్‌చైర్మన్ 'గూడపాటి'కి సత్కారం



శేషగిరిరావును సత్కరిస్తున్న శ్రీనివాసగౌడ్, మాతంగి వెంకటేశ్వర్లు, నాయుడు తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ వైస్‌చైర్మన్ గూడపాటి శేషగిరిరావును ఘనంగా సత్కరించారు. మండల వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో తరలివచ్చి శేషగిరిరావును సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఏఎంసీ వైస్ చైర్మన్‌గా శేషగిరిరావు నియమించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల యూత్ అధ్యక్షుడు బజారు సాయి, మాజీ ఎంపీపీ మాతంగి వెంకటేశ్వర్లు, అనుమంచిపల్లి గ్రామసర్పంచి నాయుడు, మాజీ సర్పంచి ఉదయభాను తదితరులు పాల్గొన్నారు.